## చిట్టీల పేరిట 30 కోట్లతో ఉడాయింపు

- ఓ స్కూల్ టీచర్ మోసం
- హయత్‌నగర్ పోలీసులకు బాధితుల ఫిర్యాదు

హయత్‌నగర్, జూన్ 30 : చిట్టీల పేరిట బాధితుల వద్ద రూ.30 కోట్లు వసూలు చేసి ఓ చిట్టీల వ్యాపారి పరారైన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం వెలుగుచూసింది. సీఐ జీ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా, నార్కట్‌పల్లి మండలం, అమ్మనబోలు గ్రామానికి చెందిన చిట్టేటి మధుసూదన్‌రెడ్డి, కుటుంబ సభ్యులతో నగరానికి వచ్చి హయత్‌నగర్‌లోని రాజరాజేశ్వరి కాలనీలో నివాసముంటున్నాడు. మధుసూదన్‌రెడ్డి వృత్తిరీత్యా హయత్‌నగర్‌లోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. స్కూల్‌లో తోటి ఉపాధ్యాయులు, కాలనీలో చుట్టుపక్కల వారి వద్ద చిట్టీలు కట్టించుకొని దాదాపు రూ.30 కోట్ల వరకు వసూళ్లు చేశాడు. చివరికి బాధితులకు చిట్టీ డబ్బులు చెల్లించకుండా మధుసూదన్‌రెడ్డి తప్పించుకు తిరుగుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

## మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీజీఎంగా ప్రసాద్

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): ఆర్మర్డ్ వెహికల్స్ నిగాన్ లిమిటెడ్‌కు చెందిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్ (ఓఎఫ్ఎంకే) చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఎస్ఎస్ ప్రసాద్ నియమితులైనట్టు భారత రక్షణ విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్టు పేర్కొన్నది.

## అమ్మవారికి బంగారు హారం



శ్రీశైలం భ్రమరాంబ ఆలయ అధికారులకు రూ.24,41,433 విలువైన 375 గ్రాముల బంగారు హారాన్ని అందజేస్తున్న భక్తుడు నటరాజ్, కుటుంబ సభ్యులు.

# నేటి నుంచి సఫారీ నిలిపివేత

అమ్రాబాద్, జూన్ 30 : అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్) పరిధిలో పర్యాటక ప్రకృతి ప్రేమికుల కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సఫారీ యాత్రను ఎన్‌టీసీఏ సూచనల మేరకు సోమవారం నుంచి నిలిపివేస్తున్నట్టు నాగర్‌కర్నూల్ జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్‌గోపిడి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్రాబాద్ మండలం ఫర్హాబాద్ గేట్ నుంచి వన్యప్రాణులు, ప్రకృతి, వ్యూ పాయింట్ ద్వారా నల్లమల అందాలను వీక్షించేందుకు ఏర్పాటు చేసిన సఫారీ యాత్రను సెప్టెంబర్ 30 వరకు నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మూడు నెలలు పెద్దపులులు, ఎలుగు బంట్లు ఇతర వన్యప్రాణుల సంతానోత్పత్తికి సమయం ఉంటుందని తెలిపారు. వన్యప్రాణులకు వాహనాలు, మనుషుల అలికిడి ద్వారా ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

# కృష్ణపట్టెలో రాబందు ఆనవాళ్లు

- కంబాలపల్లి అటవీ రేంజ్‌లో వన్యప్రాణులు
- సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాలు
- డివిజన్ అటవీ అధికారి సర్వేశ్వరరావు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): నల్లమల అటవీ ప్రాంతం అభివృద్ధికి అటవీశాఖ చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నాగార్జునసాగర్ డివిజన్ చందంపేట మండలం కంబాలపల్లి రేంజ్‌లో నల్లమల అటవీ ప్రాంతంలో అంతరించిపోతున్న 'రాబంధుల' ఆనవాళ్లు కనిపించాయి. దీంతో పాటు రెండు పెద్దపులులు సంచరిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి నల్లగొండ, కర్నూలు జిల్లాల్లో 26,795 హెక్టార్ల వరకు అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. కంబాలపల్లి రేంజ్‌లో రెండు పెద్దపులులు, రాబందులు సంచరించడం ఇదే ప్రథమమని డివిజన్ అటవీ అధికారి సర్వేశ్వర్‌రావు తెలిపారు. సీసీ కెమెరాల్లో వన్యప్రాణుల సంచారం నమోదైనట్టు తెలిపారు. అటవీ జంతువుల సంరక్షణకు కేంద్రప్రభుత్వం 4.50 కోట్లు విడుదల చేయగా.. ఆ నిధులతో అటవీశాఖ నల్లమల అటవీ ప్రాంతంలో అటవీ అభివృద్ధి, వన నర్సరీలు, రోడ్డు, చెక్ డ్యాంలతోపాటు 50కి పైగా సీసీ కెమెరాలతో నిఘా, వాచ్‌టవర్, బేస్ క్యాంపులు ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతం చుట్టూ ఇనుపగేట్లు, కంచె ఏర్పాటుచేశారు. వన్యప్రాణుల దాహార్తికి నల్లమలలో 150 కిపైగా నీటి తొట్లు, చెక్ డ్యాంలు ఏర్పాటు చేశారు.



నల్లమలలో ట్రాప్ కెమెరాకు చిక్కిన రాబంధు (ఫైల్)

# వెంకయ్య అనుభవ సంపద అమూల్యం

### ఆయన వ్యక్తిత్వం నుంచి ఎన్నో నేర్చుకున్నా

- మాజీ ఉపరాష్ట్రపతిపై ప్రధాని మోదీ ప్రశంసలు
- వెంకయ్య జీవితం ఆధారంగా 3 పుస్తకాల ఆవిష్కరణ
- హైదరాబాద్‌లో వెంకయ్యనాయుడు 75వ పుట్టినరోజు వేడుకలు



కార్యక్రమంలో వెంకయ్యనాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మణికొండ, జూన్ 30: మంచి ఆలోచనలు, మంచి వ్యక్తిత్వం, దార్శనికతల మేలు కలయికే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి జీవితమని ప్రధాని నరేంద్రమోదీ కొనియాడారు. ఆయన నుంచి తాను చాలా నేర్చుకున్నానని అన్నారు. వెంకయ్యనాయుడు 75వ పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్‌లో ఆయన మిత్రులు పంచసప్తతి పేరిట ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకయ్య జీవన ప్రస్థానం ఆధారంగా రాసిన మూడు పుస్తకాలు 'వెంకయ్యనాయుడు (ఐ లైఫ్ ఇన్ సర్వీస్)-జీవన ప్రస్థానం-ఆంగ్లం, సెలబ్రేటింగ్ భారత్ (13వ ఉపరాష్ట్రపతిగా ఐదేండ్ల ప్రయాణం)-ఆంగ్లం, మహానేత (జీవన చిత్రమాలిక)-తెలుగు' పుస్తకాలను ప్రధాని మోదీ ఆన్‌లైన్‌లో ఆవిష్కరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ప్రధాని ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక చిన్న గ్రామం నుంచి వచ్చి పెద్ద పదువులు చేపట్టిన వెంకయ్యనాయుడి అనుభవ సంపద అమూల్యమని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కొన్ని దశాబ్దాల క్రితం బీజేపీ, జనసంఘ్‌కు పునాది లేని రోజుల్లోనే వెంకయ్యనాయుడు ఏబీవీపీ కార్యకర్తగా ఎంతో కష్టపడి, పార్టీలో కీలకంగా ఎదిగారని కొనియాడారు. వెంకయ్యనాయుడు సౌమ్యత, చమత్కారంతో కూడిన వాక్చాతుర్యాన్ని ప్రశంసించిన ప్రధాని.. ఆయన తెలివితేటలు, సహజత్వం, త్వరితగతిన ప్రతిస్పందించటం, వన్‌లైనర్లకు ఎవరూ సాటి రారని ప్రశంసించారు. దేశ రాజకీయాల్లో వెంకయ్యనాయుడు సేవలను ప్రశంసించిన మోదీ, ఈ రోజు ఆవిష్కరించిన మూడు పుస్తకాలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. 2047లో అభివృద్ధి చెందిన భారతదేశం స్వతంత్ర శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనుందని, అదే సమయంలో వెంకయ్యనాయుడు కూడా తన జీవన శతాబ్ది మైలురాయిని దాటాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సందేశానికి వెంకయ్య ధన్యవాదాలు తెలుపుతూ.. మోదీ నాయకత్వంలో దేశం ప్రగ తిబాటన పయనిస్తున్నదని అన్నారు. దేశంలో పేదరిక నిర్మూలనకు మరింత కృషి జరగాలని ఆకాంక్షించిన వెంకయ్య.. ప్రజలకు ఉచితాలను అలవాటు చేయవద్దని సూచించారు. ఈ వేడుకకు పలువురు రాజకీయ, రాజకీయేతర ప్రముఖులు హాజరై వెంకయ్యనాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ, మిజోరం గవర్నర్లు రా ధాకృష్ణన్, కంభంపాటి హరిబాబు, కేంద్రమం త్రి జీ కిషన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి టీ హరీశ్‌రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఆ రాష్ట్ర మంత్రు లు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సృజనాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట ఎస్సై ఆత్మహత్యాయత్నం

అశ్వారావుపేట, జూన్ 30: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్యకు యత్నించాడు. ఫోన్ లోకేషన్ ద్వారా గుర్తించిన పోలీసులు.. చికిత్స కోసం మహబూబాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వివరాలు ఇలా.. అశ్వారావుపేట పోలీస్ సేషన్ పక్కనే ఉన్న క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఎస్సై శ్రీను ఆదివారం ఉదయం 8:30 గంటలకు మఫ్టీలో స్టేషన్‌కు వచ్చారు. సోమవారం నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వస్తున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచనలు చేశారు. అదే సమయంలో ప్రైవేట్ కారు రావడంతో డ్రైవర్‌ను దింపిన ఎస్సై.. ఇప్పుడే వస్తానంటూ కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోయారు. మధ్యాహ్నం తరువాత సిబ్బంది ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో వెంటనే సీఐ జితేందర్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన వెంటనే ఎస్సై ఫోన్ లోకేషన్‌ను ట్రాక్ చేయగా మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత మండలంలోని తిరుమల కుంట అటవీ ప్రాంతంలో స్విచ్ఛాఫ్ అయినట్టు గుర్తించారు. కానీ రాత్రి 10:45 గంటల వరకు ఆచూకీ లభ్యం లభించలేదు. ఇంతలో మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్టు గుర్తించారు. వెంటనే అక్కడి ఎస్సై అరుణ స్పందించి చికిత్స కోసం అక్కడి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఎస్సై శ్రీను ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.



శ్రీరాముల శ్రీను, ఎస్సై అశ్వారావుపేట

## 'ధన్వంతరి' మోసాలపై రోడ్డెక్కిన బాధితులు

- రూ.1,000 కోట్లకు మోసపోయామని వెల్లడి
- న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 30 (నమస్తే తెలంగాణ): ధన్వంతరి ఫౌండేషన్ చేతిలో దారుణంగా మోసపోయిన తమకు న్యాయం చేయాలని బాధితులు రోడ్డెక్కారు. దాదాపు 350 మంది బ్రాహ్మణ వయోధికులు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించి ఆ ఫౌండేషన్ మోసాలను వివరించారు. అగ్రహారాల నిర్మాణం, సేవా కార్యక్రమాల పేరుతో ధన్వంతరి ఫౌండేషన్ నిర్వాహకులు తమ నుంచి రూ.1,000 కోట్ల వరకు వసూలు చేశారని, ఆ సొమ్మును డొల్ల కంపెనీల్లోకి మళ్లించడం ద్వారా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పంతంగి కమలాకరశర్మ, ఆయన కుటుంబసభ్యులు అక్రమంగా ఆస్తులను కూడబెట్టుకున్నారని తెలిపారు. వాటి వేలం ద్వారా వచ్చిన సొమ్మును తమకు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కమలాకరశర్మ పాస్‌పోర్టులను సీజ్ చేయాలని, ధన్వంతరి ఫౌండేషన్ మోసాలపై ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

## బీటీపీఎస్‌కు 25 కోట్లు నష్టం

- పిడుగుపాటు ఫలితం

మణుగూరు టౌన్, జూన్ 30: భద్రాద్రి జిల్లా మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (బీటీపీఎస్)లో యూనిట్-1 వద్ద శనివారం రాత్రి పిడుగు పడటం వల్లే జరిగిన అగ్ని ప్రమాదం సంభవించిందని అధికారులు ధ్రువీకరించారు. విద్యుత్తు థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య, విద్యుత్తు సౌధా ఎస్ఈ రత్నాకర్ ఆదివారం బీటీపీఎస్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం డైరెక్టర్ లక్ష్మయ్య మీడియాతో మాట్లాడుతూ.. దీనివల్ల దాదాపు రూ.25 కోట్ల మేర నష్టం జరిగి ఉంటుందని, 270 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడినట్టు తెలిపారు.



పిడుగుపాటుకు కాలిన బీటీపీఎస్ జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ (జీటీ)

## కస్టమ్స్ అధికారుల ఇండ్లలో సీబీఐ సోదాలు


- ముగ్గురిపై కేసు నమోదు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): విదేశీ కరెన్సీని అక్రమ పద్ధతుల్లో మార్పిడి చేసినందుకు ప్రయత్నించిన ఇద్దరు కస్టమ్స్ విభాగం ఆఫీస్ సూపరింటెండెంట్లు, ఒక ఇన్‌స్పెక్టర్ ఇండ్లలో, వారి బంధువుల ఇండ్లల్లో సీబీఐ అధికారులు సోదాలు చేపట్టారు. ఆదివారం హైదరాబాద్‌లో మూడు చోట్ల, ఢిల్లీలోని ఓ ప్రాంతంలో ఈ సోదాలు జరిపారు. వివరాల్లోకెళ్తే... శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ విమానాశ్రయం కస్టమ్స్ విభాగంలో పనిచేస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్లు వై శ్రీనివాసులు, పేరి చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ పంకజ్ గౌతమ్‌లు విదేశీ కరెన్సీని గత మార్చి 16న ఆఫీస్‌బాయ్ ఓంప్రకాశ్ దత్తాతో మార్పిస్తుండగా సీఐఎస్ఎఫ్ క్రైం ఇంటెలిజెన్స్ విభాగం అదుపులోకి తీసుకొన్నది. కరెన్సీ మార్పిడికి వచ్చిన బహదూరపురాకు చెందిన గులామ్లీ, సాజిత్, ఓంప్రకాశ్ దత్తాను విచారించగా కస్టమ్స్ అధికారుల పాత్ర ఉన్నట్టు తేలింది. వీరి వద్ద నుంచి 6,97,805 విలువైన ఇండియన్, విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకొన్నారు. దీనిపై ఆర్జీఐఏ కస్టమ్స్ కమిషనరేట్‌లోని డిప్యూటీ కమిషనర్ అలేఖ్య బల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు అధికారులపై ఈనెల 28న సీబీఐ కేసునమోదు చేసిం ది. తాజాగా సీబీఐ హైదరాబాద్, ఢిల్లీలో నాలుగుచోట్ల సోదాలు నిర్వహించింది.




మనలో చాలామంది క్రెడిట్ కార్డ్స్ వాడుతూంటారు. అయితే ఈ క్రెడిట్ కార్డుల్లో ఎన్ని రకాలున్నాయో.. వాటి లాభాలేంటో మీకు తెలుసా? బ్యాంకింగ్ రంగంలో ఉన్న ప్రస్తుత పోటీ వాతావరణంలో కస్టమర్లను ఆకట్టుకోవడం ఓ పెద్ద టాస్క్ అయిపోయింది. అందుకే యూజర్ల అవసరాలకు, అలవాట్లకు తగ్గట్టుగా ఒక్కో కార్డుకు ఒక్కో రకంగా ప్రయోజనాలను చేర్చి అందిస్తున్నాయి ఆయా సంస్థలు.

# అక్కెరకో క్రెడిట్ కార్డ్




**బేసిక్ క్రెడిట్ కార్డ్స్**

బ్యాంకులు, సంస్థలు తమ కస్టమర్లకు ఉచితంగానే ఇస్తున్నాయి. మరికొన్ని తక్కువ ఫీజును వసూలు చేస్తున్నాయి. పెద్దగా బెనిఫిట్స్ ఏవీ ఉండవు.

**రివార్డులకు..**

క్రెడిట్ కార్డ్స్‌ను ఎక్కువగా వాడేవారికి ఇవి ఉత్తమం. ప్రతీ కొనుగోలుపై రీడిమబుల్ రివార్డ్స్ యాడ్ అవుతాయి.

**క్యాష్ బ్యాక్ కోసం..**

వీటితో మనం కొనే వస్తువుల ధర కొంత మొత్తం తగ్గుతుంది. అకౌంట్లలో ఆ మొత్తా లు జమవుతాయి.

**ప్రయాణాలకు వీలుగా..**

ప్రయాణాలు ఎక్కువగా చేసేవారికి సౌకర్యంగా ఉంటాయి. ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్, హోటల్ చార్జీల్లో రాయితీ వంటివి అందుకోవచ్చు.

**వ్యాపారస్తులకు ప్రయోజనకారిగా..**

వ్యాపారులు, కంపెనీల యజమానుల కోసం వీటిని ఇస్తున్నారు. వ్యాపార లావాదేవీలపై రివార్డ్స్ పొందవచ్చు.

**విద్యార్థుల కోసం..**

పరిమిత రుణ చరిత్ర ఉన్నవారు, యువతకు లాభదాయకం. వార్షిక చార్జీలుండవు. బోనస్ పాయింట్లు వస్తాయి.

**కో-బ్రాండెడ్**

వీటితో ఉచిత హోటల్ సర్వీసునూ అందుకోవచ్చు. అయితే హై ఎండ్ కస్టమర్లకే ఇవి దొరుకుతాయి.

**స్టోర్ క్రెడిట్ కార్డ్స్**

రిటైల్ స్టోర్ల ద్వారా ఇష్యూ అవుతున్నాయి. ఎక్కడైతే లేదా ఎవరైతే ఇస్తారో అక్కడే ఈ క్రెడిట్ కార్డ్స్ చెల్లుతాయి.

**షాపింగ్ కోసం..**

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ షాపర్స్‌కు సూటబుల్. వీటితో కొంటే డిస్కౌంట్లు, రివార్డులు, క్యాష్‌బ్యాక్ వంటి రకరకాల ఆఫర్లను అందుకోవచ్చు.

**విమాన ప్రయాణికులకు..**

విమానయాన సంస్థలతో కలిసి బ్యాంకులు వీటిని ఇష్యూ చేస్తున్నాయి. టిక్కెట్ల ధరపై రాయితీలు, రివార్డ్ పాయింట్లు అందుతాయి.

**ఇంధన వినియోగదారులకు..**

వీటితో వాహనదారులు పెట్రోల్, డీజిల్ పోయించుకున్నప్పుడు డిస్కౌంట్ పొందవచ్చు. సర్‌చార్జీలను తప్పించుకోవచ్చు.

**వినోదాలకు వెళ్లేవారి కోసం..**

సినిమాలకు తరచూ వెళ్లేవారి కోసం ఈ క్రెడిట్ కార్డులున్నాయి. సెక్యూరిటీపైనా క్రెడిట్ కార్డులను పొందవచ్చు. క్రెడిట్ స్కోర్‌తో సంబంధం లేకుండా నగదు గ్యారెంటీతో వీటిని జారీ చేస్తారు.

# పోస్టల్ జీవిత బీమాకు పోదామా..

### పీఎల్ఐ-ఆర్పీఎల్ఐకి ఉన్న ఐటీ ప్రయోజనాలేమిటి?

**భారతీయ** తపాలా కార్యాలయం (ఇండియా పోస్ట్ లేదా పోస్టాఫీస్) రెండు రకాల జీవిత బీమా పథకాలను అందిస్తున్నది. అవే.. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్పీఎల్ఐ). భద్రత, సుస్థిరతలకు మదుపరులు ముందుగా చూసేది పోస్టాఫీస్ స్కీములనేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ రంగ ఉద్యోగులకు, ఆయా రంగాల నిపుణులు, వ్యాపారులు, ఇతరత్రా వృత్తులవారికి అనేక ప్రయోజనాలను చేకూర్చే ఈ స్కీముల్లో బీమా పథకాలకు సైతం గొప్ప ఆదరణే ఉంటున్నది. వాటికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులు కూడా ఉన్నాయి. పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ ప్రీమియం చెల్లింపుల్లో పోస్టాఫీస్ రిబేట్‌ను ఆఫర్ చేస్తున్నది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద పీఎల్ఐ స్కీంలో 6, 12 నెలలు లేదా ఆపై ముందస్తు పేమెంట్లకు 1 శాతం నుంచి 2 శాతం రిబేట్ వస్తున్నది. అలాగే ఆర్పీఎల్ఐ స్కీంలో 3, 6, 12 నెలలు లేదా ఆపై ముందస్తు చెల్లింపులకు 0.5 శాతం, 1 శాతం, 2 శాతం రిబేట్లు వర్తిస్తున్నాయి.

- పోస్టాఫీసుల్లో లేదా పోస్టల్ ఏజెంట్లను సంప్రదించి ఈ బీమా పాలసీలను తీసుకోవచ్చు.
- పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ పాలసీదారులు తమ ప్రీమియంలను దేశవ్యాప్తంగా ఉన్న ఏ పోస్టాఫీస్‌లోనైనా చెల్లించవచ్చు. పీఎల్ఐ పోర్టల్ ద్వారా లేదా డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా, భీమ్/యూపీఐ, నెట్ బ్యాంకింగ్ ద్వారా కూడా పేమెంట్స్ చేసుకోవచ్చు. ఉద్యోగులు తమ సాలరీ అకౌంట్ల నుంచి ఆటోమేటిక్ డెబిట్ కూడా చేయించుకోవచ్చు.
- ఈ పోస్టల్ బీమా పథకాలకు 19-55 ఏండ్లవారు అర్హులు.
- పాలసీ కోసం ఫొటోలు, ప్రపోజల్ ఫామ్, వయస్సు-చిరునామా ధ్రువీకరణ పత్రాలు, ఐడెంటిటీ ప్రూఫ్, అనారోగ్యం ఉంటే వాటి మెడికల్ రిపోర్టులు అవసరం.
- సమ్ అష్యూర్డ్ పరిమితి కనిష్ఠంగా రూ.10,000, గరిష్ఠంగా రూ.10 లక్షలు.
- పాలసీ తీసుకున్న 3 ఏండ్ల తర్వాత నుంచి రుణాలు, సరెండర్ సదుపాయం ఉంటుంది.
- పీఎల్ఐలో సుమంగళ్, బాల జీవన్ బీమాలపై రుణ సౌకర్యం, సరెండర్ అవకాశం లేదు.
- గ్రామీణ పీఎల్ఐలో గ్రామ ప్రియ, గ్రామ సుమంగళ్, బాల జీవన్ బీమాలపై రుణ సౌకర్యం, సరెండర్ అవకాశం ఉండదు.
- బాల జీవన్ బీమా పథకానికి 5-20 ఏండ్లవారు అర్హులు. తల్లిదండ్రుల వయసు 18-45 ఏండ్ల మధ్య ఉండాలి. కుటుంబంలో గరిష్ఠంగా ఇద్దరి పిల్లలకే పథకం వర్తిస్తుంది. గరిష్ఠ సమ్ అష్యూర్డ్ రూ.3 లక్షలు.




**పీఎల్ఐ పథకాలు**


- హోల్ లైఫ్ అష్యూరెన్స్ (సురక్ష)
- కన్వర్టబుల్ హోల్ లైఫ్ అష్యూరెన్స్ (సువిధ)
- ఎండోమెంట్ అష్యూరెన్స్ (సంతోష్)
- జాయింట్ లైఫ్ అష్యూరెన్స్ (యుగళ్ సురక్ష)
- యాంటిసిపేటెడ్ ఎండోమెంట్ అష్యూరెన్స్ (సుమంగళ్)
- చిల్డ్రెన్ పాలసీ (బాల జీవన్ బీమా)

**ఆర్పీఎల్ఐ పథకాలు**

- హోల్ లైఫ్ అష్యూరెన్స్ (గ్రామ సురక్ష)
- కన్వర్టబుల్ హోల్ లైఫ్ అష్యూరెన్స్ (గ్రామ సువిధ)
- ఎండోమెంట్ అష్యూరెన్స్ (గ్రామ సంతోష్)
- పదేండ్ల గ్రామీణ పీఎల్ఐ (గ్రామ ప్రియ)
- యాంటిసిపేటెడ్ ఎండోమెంట్ అష్యూరెన్స్ (గ్రామ సుమంగళ్)
- చిల్డ్రెన్ పాలసీ (బాల జీవన్ బీమా)

# లాభాల స్వీకరణకు అవకాశం!

**గత** వారం దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డుల మోత మోగించాయి. వరుస ట్రేడింగ్ సెషన్లలో ఆకర్షణీయ లాభాలనే అందుకున్నాయి. అయితే చివరి రోజున మాత్రం మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. ఫలితంగా సూచీలు నయా ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడలేకపోయాయి. అయినప్పటికీ అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,822.83 పాయింట్లు లేదా 2.36 శాతం పెరిగి 79వేల స్థాయికి ఎగువన 79,032.73 వద్ద స్థిరపడింది. అలాగే ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 509.50 పాయింట్లు లేదా 2.16 శాతం అందిపుచ్చుకుని 24వేల స్థాయిని దాటి 24,010.60 దగ్గర నిలిచింది. అయితే ఈ వారం మదుపరులు లాభాల స్వీకరణకు దిగవచ్చన్న అంచనాలున్నాయి. సూచీలు దాదాపు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతుండటమే కారణం. మదుపరులు పెట్టుబడుల జోష్‌ను కొనసాగించేందుకూ వీలు లేకపోలేదంటున్నారు. జూన్ నెల వాహన విక్రయాలు, జీఎస్టీ వసూళ్లు తదితర అంశాలు మార్కెట్ ట్రెండ్‌ను ప్రభావితం చేయవచ్చు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,700 పాయింట్ల స్థాయి కీలకం. దీనికి దిగువన ముగిస్తే 23,400 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చు. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,400-24,600 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని చెప్తున్నారు.




హెల్త్ ఇన్సూరెన్స్‌ను అందరికీ దగ్గర చేసేందుకు క్యాష్‌లెస్ చికిత్స నుంచి క్లెయిమ్ సెటిల్మెంట్ వరకు ఇటీవల పలు మార్పులను చేసింది ఐఆర్డీఏఐ.

# ఆరోగ్య బీమాలో మార్పులొచ్చాయ్

- వయసుతో సంబంధం లేకుండా అందరూ ఆరోగ్య బీమాను తీసుకోవచ్చు. సీనియర్ సిటిజన్లకు ఇది గొప్ప ఊరట.
- గుండె జబ్బు, క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, ఎయిడ్స్ రోగులకూ ఆరోగ్య బీమా.
- డిశ్చార్జి అభ్యర్థన వస్తే మూడు గంటల్లోగా బీమా సంస్థలు తుది అనుమతి ఇవ్వాలి.
- ఆయుర్వేద, యోగా, నాచురోపతి, సిద్ధ, యునానీ, హోమియోపతికీ బీమా.
- ముందున్న షుగర్, బీపీ వంటి అనారోగ్య సమస్యలకు ఇన్సూరెన్స్ కవరేజీ ఉండాలంటే పాలసీ కొన్న నాలుగేండ్ల తర్వాతే వీలుపడేది. అయితే దీన్ని మూడేండ్లకు తగ్గించారు. జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ వంటి స్పెసిఫిక్ డీసీజ్‌లు/ప్రొసీజర్ల వెయిటింగ్ పీరియడ్ కూడా మూడేండ్లే.
- మీరు పాలసీ తీసుకున్న బీమా సంస్థతో లింకైన దవాఖానలేగాక ఇతర దవాఖానల్లో చికిత్స తీసుకున్నా క్యాష్‌లెస్ వైద్య సదుపాయం.
- ఆరోగ్య బీమాలో మారటోరియం వ్యవధిని 8 ఏండ్ల నుంచి 5 ఏండ్లకు తగ్గింపు. రెగ్యులర్ పాలసీదారుల క్లెయిమ్‌ల తిరస్కరణ తగ్గనున్నది.
- మీకు ఒకటి కన్నా ఎక్కువ పాలసీలుంటే.. చికిత్స ఖర్చును క్లెయిమ్ చేసుకోవడానికి వాటన్నిటినీ ఒకే సారి వినియోగించుకోవచ్చు.
- ఇండెమ్నిటీ ఆధారిత పాలసీలు వద్దన్న ఐఆర్డీఏఐ.. బెనిఫిట్ ఆధారిత పాలసీలనే ఇవ్వాలని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్పష్టం చేసింది. దీనివల్ల పాలసీదారులకు నిర్దిష్ట దవాఖాన ఖర్చులు అందుతాయి.